క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



బాబ్జాన్‌ను సన్మానిస్తున్న ప్రణీత్‌రెడ్డి

కదిరి టౌన్‌: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరం కలసికట్టుగా కృషి చేద్దామని ఆ పార్టీ శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.ప్రణీత్‌ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల పార్టీ పట్టణాధ్యక్షుడిగా నియమితులైన షేక్‌ బాబ్జాన్‌ ఆదివారం పార్టీ కార్యాలయంలో ప్రణీత్‌ రెడ్డిని పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా పని చేయాలన్నారు. అనంతరం బాబ్జాన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లింగాల కృపాకర్‌రెడ్డి, కూరగాయల ఇస్మాయిల్‌, అహమ్మద్‌, ఆవుల స్వామి, సింగిల్‌ విండో అధ్యక్షుడు అంజనేయులు, రమేష్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



అక్కులప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పార్టీ నాయకులు

కనగానపల్లి: మండలంలోని మద్దెలచెరువు గ్రామ సర్పంచ్‌ ముత్యాలమ్మ భర్త, వైఎస్సార్‌సీపీ కార్యకర్త అక్కులప్ప (58) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అక్కులప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ తరపున అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే చర్యలు



మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ నాగరాజు

పుట్టపర్తి టౌన్‌: మద్యం షాపు లైసెన్స్‌దారులు నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరపితే చర్యలు తప్పవని ఎక్సైజ్‌ సీఐ నాగరాజు హెచ్చరించారు. ఆదివారం ఆయన తన సిబ్బందితో కలసి పుట్టపర్తి, బుక్కపట్నం పరిసర ప్రాంతాల్లో మద్యందుకాణాలు, హోటళ్ల, ధాబాలపై దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రాజు సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచుకు సన్మానం



సర్పంచ్‌ పంచరత్నమ్మ, ఉత్తన్న దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

నల్లచెరువు: ఇటీవల జాతీయ ఉత్తమ సర్పంచుగా అవార్డు అందుకున్న నల్లచెరువు మేజర్‌ పంచాయితీ సర్పంచ్‌ పంచరత్నమ్మను స్థానిక గీతామందిరంలో ఆదివారం భారతీయ అంబేడ్కర్‌ సేన(బాస్‌) వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్‌ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌ సేన సభ్యులు మాట్లాడుతూ పంచరత్నమ్మ తన భర్త ఉత్తన్నతో కలిసి పంచాయతీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. తన కృషి ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది ఉత్తమ సర్పంచుగా తన పేరును సుస్థిరం చేసుకుందన్నారు. అనంతరం సర్పంచ్‌ దంపతులను పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ అంజనప్ప, ఆర్టీసీ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ పెద్దన్న, ప్రజాకవి పోతుల రెడ్డెప్ప, రిటైర్డ్‌ డిప్యూటీ జైలర్‌ లక్ష్మీనారాయణ, రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి

ధర్మవరం అర్బన్‌: పట్టణంలోని కళాజ్యోతిలో ఆదివారం రాత్రి ఘంటసాల వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కళాజ్యోతి అధ్యక్షుడు కుంటిమల నారాయణ, కార్యదర్శి బాలకొండ రామకృష్ణ ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాయకులు వీరలక్ష్మి, జ్యోతి, బాలకామేశ్వరరావులు ఆలపించిన ఘంటసాల పాటలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాజ్యోతి ఉపాధ్యక్షుడు శింగనమల రామకృష్ణ, సభ్యులు జగ్గా వేణుగోపాల్‌, పల్లెం వేణుగోపాల్‌, రాంప్రసాద్‌, మధుసూదన్‌, పెద్దారెడ్డి, రమేష్‌ బాబు, రామన్న, పోలా వెంకటనారాయణ, మోహన్‌దాస్‌ తదితరులు పాల్గొన్నారు.

గ్రాసం కరువు.. పోషణ బరువు

- అగ్నికి ఆహుతైన కొండగుట్టలు
- ట్రాక్టర్‌ పశుగ్రాసం రూ.30 వేలు పైమాటే
- గ్రాసం కొనలేక జీవాలు అమ్ముకుంటున్న కాపరులు
- తాగునీటికీ తప్పని అవస్థలు
- ఆదుకోని కూటమి ప్రభుత్వం



ఈడు పోయినపొలంలో మేత కోసం వెంపర్లాడుతున్న గొర్రెలు



ట్రాక్టర్‌పై పశుగ్రాసం తరలిస్తున్న దృశ్యం

నల్లమాడ: పుట్టపర్తి నియోజకవర్గంలో గ్రాసం కొరత తీవ్రమైంది. దీంతో పశుపోషకులు, జీవాల పెంపకదారులు వాటి పోషణకు అష్టకష్టాలు పడుతున్నారు. వ్యవసాయం కంటే అధికంగా రైతులు, కూలీలు సన్నజీవాలు (గొర్రెలు, మేకలు), పాడి పశువుల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వేసవి నడికొనకముందే తీవ్రస్థాయిలో గ్రాసం కొరత నెలకొనడంతో సన్నజీవాలు, పాడి పశువుల పోషణ కష్టంగా మారిందని యజమానులు వాపోతున్నారు. అధిక ధరలకు గ్రాసం కొనలేక పలువురు జీవాలను అమ్మేసుకొంటుండగా చాలామంది అతికష్టంగా పశుపోషణ సాగిస్తున్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో సన్నజీవాలు (గొర్రెలు, మేకలు) 10 నుంచి 12 లక్షలు, ఆవులు, ఎద్దులు, గేదెలు 50 వేలు పైబడి ఉన్నట్లు సంబంధిత అధికారుల సమాచారం.

ఏటా ఇదే దుస్థితి..

వేసవి రాగానే పొలం గట్లు, సమీప కొండగుట్టలు అగ్నికి ఆహుతి కావడం సర్వసాధరణమైంది. ఈఏడాది కూడా అదే పరిస్థితి నెలకొంది. ఎండు గడ్డిని కాల్చివేసే ఉద్దేశంతో పొలం గట్లకు నిప్పు పెట్టేవారు కొందరైతే మరికొందరు పశువుల కాపరులు బీడీ కాల్చి ఆర్పకుండా పడవేయడంతో మంటలు వ్యాపించి పొలంగట్లు, గుట్టల్లో గ్రాసం పూర్తిగా కాలిపోయి పశువులకు మేత దొరకని పరిస్థితి నెలకొంది. ఇటీవల కాలంలో అమడగూరు, ఓడీ చెరువు, నల్లమాడ మండలాల్లో పలుచోట్ల అగ్ని ప్రమాదాల్లో కంది పంట, మామిడి చెట్లు దెబ్బతిని రైతులు నష్టపోయారు. తాజాగా శనివారం పుట్టపర్తి మండలం గంగంపల్లి వద్ద మేతకు వెళ్లిన 20 గొర్రెలు అగ్ని కీలలకు ఆహుతైన విషయం తెలిసిందే.

గ్రాసం ధరకు రెక్కలు..

ప్రస్తుతం ఒక ట్రాక్టర్‌ వేరుశనగ కట్టె (పశుగ్రాసం) రూ.30 వేలు పైగా ధర పలుకుతున్నట్లు పశువుల యజమానులు తెలిపారు. అదికూడా సుదూర ప్రాంతాల్లో ఎక్కడ లభ్యమైతే అక్కడికి వెళ్లి కొనుగోలు చేసి తీసుకురావాల్సి ఉంది. దీంతో అదనపు రవాణా ఖర్చులతో పాటు వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. గ్రాసం కొరత తీవ్రస్థాయిలో నెలకొని తాము ఎన్నో ఇబ్బందులు పడుతున్నా పశుపోషకులను ఆదుకొనేందుకు కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోడం బాధాకరమని పశుపోషకులు నిట్టూరుస్తున్నారు.

తాగునీటికీ కటకట

ఈఏడాది అరకొర వర్షాలు కురవడంతో ఇప్పటికే చెరువులు, కుంటల్లో నీరు పూర్తిగా ఇంకిపోయింది. అక్కడక్కడా రైతులకు చెందిన బోరుబావుల వద్ద వారి అనుమతితో చిన్నపాటి కుంటలు ఏర్పాటు చేసుకొని అందులోకి నీరు వదులుకొని గొర్రెలు, మేకలు, పశువుల దాహం తీరుస్తున్నారు. మేత కోసం అడవిలో ఎంత దూరం వెళ్లినా నీటి కోసం గ్రామ సమీపంలోని కుంటల వద్దకు జీవాలను తోలుకొని రావడం, నీరు తాగిన తరువాత తిరిగి మేతకు తోలుకెళ్లడం చేస్తున్నామని కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడవిలో మేత లేదు



అడవంతా తిరిగినా గొర్రెలు నిలబడి మేసేందుకు ఎక్కడా గడ్డిపోచ లేదు. కటాలు, చిన్న చిన్న గుట్టలు అన్నీ కాలిపోయాయి. పద్దన్నే రొంచేపు జీవాలను అట్లా తిప్పుకొనిరావడం, ఎండపడగానే చెట్ల కింద నీడన తోలుకోవడం చేస్తున్నా. మేత లేకపోవడంతో గొర్రెలు కాయడం చానా కష్టమైపోయింది.

–కె. నరసప్ప, ఎద్దులవాండ్లపల్లి, నల్లమాడ మండలం

ప్రభుత్వం రాయితీపై దాణా ఇవ్వాలి



మేత లేకపోవడంతో వారం క్రితం 13 జీవాలను అమ్మేశా. ఇంకా కొన్ని జీవాలు ఉన్నాయి. పశుగ్రాసం కొందామంటే ఒక ట్రాక్టర్‌ వేరుశనగ కట్టె రూ.30 వేలు పైగా ధర చెబుతున్నారు. గ్రాసం కొని జీవాలు మేపే పరిస్థితి లేదు. ప్రభుత్వం స్పందించి పశుపోషకులకు రాయితీపై టీఎంఆర్‌ దాణా పంపిణీ చేయాలి. తెలంగాణాలో పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది.

–సి. ఈశ్వర, నల్లమాడ

ఇప్పట్లో అలాంటి ప్రతిపాదన ఏదీ లేదు

సబ్సిడీపై దాణా పంపిణీ చేసే విషయం గురించి ప్రభుత్వం నుంచి ఇంతవరకు మాకు ఎలాంటి సమాచారం లేదు. ప్రస్తుతం పశు బీమా కార్యక్రమం జరుగుతోంది. సబ్సిడీపై పశుగ్రాసం, దాణా పంపిణీ గురించి ప్రభుత్వం నుంచి మాకు ఏదైనా సమాచారం అందితే వెంటనే పశువుల యజమానులకు తెలియపరుస్తాం.

–డాక్టర్‌ రవీంద్రనాయక్‌, పశువైద్యాధికారి, నల్లమాడ మండలం

నిర్మించారు... వదిలేశారు!

- దిష్టిబొమ్మలా ఆర్టీసీ బస్టాండు



నిరూపయోగంగా తనకల్లు ఆర్టీసీ బస్టాండ్‌

తనకల్లు: మండల కేంద్రంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ నిరూపయోగంగా మారింది. రూ. లక్షలు ఖర్చు చేసిన నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ ప్రస్తుతం బిచ్చగాళ్లు, మందుబాబులకు ఆవాసంగా మారింది. తనకల్లులోని జాతీయ రహదారి–42 పక్కన దాదాపు పదిహేనేళ్ల క్రితం రూ. 5 లక్షల వ్యయంతో బస్టాండ్‌కు పక్కా భవనాన్ని ఏర్పాటు చేశారు. బస్టాండ్‌ భవనం లోపల రెండు షాపింగ్‌ రూంలు, ప్రయాణికుల సౌకర్యం కోసం వెనుక వైపున మరుగుదొడ్లు నిర్మించారు. అయితే కొద్ది రోజులు బస్టాండ్‌లో బస్సులు ఆగేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం ఆర్టీసీ అధికారులు కంట్రోలర్‌ను కూడా నియమించారు. కానీ రాను రాను బస్సులను ఆపకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్‌కు రావడం మానేశారు. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్‌ భవనం ఎందుకు పనిరాకుండా పోయిందని ప్రజలంటున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం బస్టాండ్‌ ప్రాంగణం చెంతాచెదారంతో నిండిపోయింది. మరుగుదొడ్లు పనికిరాకుండా పోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గిరిజన గురుకుల పాఠశాల తనిఖీ

తనకల్లు: మండలంలోని సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలను కన్వీనర్‌ ప్రిన్సిపాల్‌ మురళీశ్రీనివాస్‌ ఆదివారం తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాన్ని విద్యార్థినులకు అందజేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు అవుతున్నారా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు.

కొందరు ఉపాధ్యాయులు, సిబ్బంది రెండు రోజులకు ముందుగానే హాజరు రిజిస్టర్‌లో సంతకాలు ఎందుకు చేశారని ప్రశ్నించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విచారణకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ సరఫరాకు కృషి



బత్తలపల్లిలో ఏఈఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్‌

బత్తలపల్లి: ప్రతి గ్రామానికి నాణ్యమైన విద్యుత్‌ సరఫరా అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రూ.22 లక్షలతో నిర్మించిన ఏఈఈ కార్యాలయం, అప్పరాచెరువులో 11 కేవీ సబ్‌స్టేషన్‌లో 24''7 ఫీడర్‌, బత్తలపల్లిలో రూ.35 లక్షలతో చేపట్టిన తాగునీటి పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంపేడ్‌ డిస్ట్రిబ్యూషన్‌ సెక్టార్‌ స్కీం కింద రూ.1.62 కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా అప్పరాచెరువు, చెన్నరాయపట్నం, జ్వాలాపురం గ్రామాలకు నిరంతర త్రీఫేజ్‌ విద్యుత్‌ సరఫరా ఉంటుందన్నారు. మండల కేంద్రంలో జిల్లా పరిషత్‌ నిధులు రూ.35 లక్షలతో నీటి సమస్యల పరిష్కారానికి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జనసేన నేత చిలకం మధుసూదన్‌రెడ్డి, ఆర్డీఓ మహేష్‌, తహసీల్దార్‌ స్వర్ణలత, విద్యుత్‌ ఎస్‌ఈ బాలసురేంద్ర, ఏఈ శివయ్య, జెడ్పీటీసీ సుధ, ఉప సర్పంచు కోటి గోపీనాథ్‌, శారదమ్మ, అధికారులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్‌: పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ బాధితులకు రూ.47 లక్షల విలువైన సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ కింద వైద్యం అందని జబ్బులకు రోగులే వైద్యం చేయించుకున్నారని, వారికి సీఎంఆర్‌ఎఫ్‌ కింద చెక్కులను అందించినట్లు మంత్రి తెలిపారు. అనంతరం పట్టణంలోని కాలేజి సర్కిల్‌లోనున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్‌, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ హరీష్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

కదిరి అర్బన్‌: కదిరి మున్సిపాల్టీ, రూరల్‌ మండలంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కదిరి పట్టణం, రూరల్‌ మండలం మొత్తం 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో మొత్తం 2,487 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వేసవి కావడంతో పరీక్షా కేంద్రాల్లో తాగునీటి, విద్యుత్‌, ఫ్యాన్లు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరధిలో 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. నలుగురికంటే ఎక్కువ మంది గుంపుగా సంచరించకూడదు. పరీక్షా కేంద్రాలకు 2 కిలోమీటర్ల పరిధిలోని జిరాక్స్‌ దుకాణాలు బంద్‌ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చెన్నేకొత్తపల్లి: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని మండల విద్యాశాఖ అధికారి–2 ప్రసూన్‌కుమార్‌ నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 7 ఉన్నత, కేజీబీవీ, ఏపీ మోడల్‌ స్కూళ్లలో మొత్తం 465 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. ఏపీ మోడల్‌ స్కూల్‌, జూనియర్‌ కళాశాలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ధర్మవరం: పదో తరగతి పరీక్షలు సర్వం సిద్ధం చేశామని ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్‌లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్‌, మెడిసిన్‌ తదితర సదుపాయాలు అన్ని ఏర్పాట్లు చేయించామని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు నిర్వహించనున్నామని తెలిపారు. మొత్తం 2156 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, ఇందుకోసం 125 మంది ఇన్విజిలేటర్లు, 11 మంది డిపార్ట్‌మెంట్‌ ఆఫీసర్లు, 11 మంది చీఫ్‌ సూపరింటెండెంట్లను నియమించామని పేర్కొన్నారు. ఓపెన్‌ స్కూల్‌ పదో తరగతి పరీక్షలు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మాత్రమే నిర్వహిస్తున్నామని 30 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు.

తాడిమర్రి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కృష్ణమోహన్‌ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 182 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

'రమేష్‌బాబు.. నోరు అదుపులో పెట్టుకో'

ఓడీచెరువు: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి వేమయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న పసుపులేటి రమేష్‌ బాబు నోరు అదుపులో పెట్టుకోవాలని ఆ పార్టీ నేతలు హెచ్చరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యదర్శి ఆంజనేయులు, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి రత్నబాయి, నాయకుడు వివి.రమణ, రవి విలేకరులతో మాట్లాడారు. ముదిగుబ్బ మండలం అడవిబ్రాహ్మణపల్లితండా వాసులు తమ 84 ఎకరాల భూములను ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణయాదవ్‌ అక్రమంగా ఆన్‌లైన్‌లోకి ఎక్కించుకున్నారని, తమకు న్యాయం చేయాలని తమ పార్టీ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులను కోరారన్నారు. బాధితులకు న్యాయం చేయాలని తమ పార్టీ నేతలు రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారన్నారు. అయితే ఎలాంటి సంబంధం లేని రమేష్‌బాబు తమ పార్టీ నేతలపై అవాకులు చవాకులు పేలితే సహించబోమని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ టీడీపీ నేత మృతి



రమేష్‌ నాయుడు(ఫైల్‌)

తాడిమర్రి: మండలంలోని తురకవారిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నేత తమ్మినేని రమేష్‌ నాయుడు (46) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రమేష్‌నాయుడు ఈనెల 9న పులివెందుల వెళ్లి స్వగ్రామానికి కారులో వస్తుండగా పార్నపల్లి మండలం నీర్జాంపల్లి సమీపంలో కారుకు ఆవు అడ్డం రావడంతో తప్పించబోయి కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రమేష్‌నాయుడిని కుటుంబ సభ్యులు బెంగుళూరులోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మంత్రి సత్యకుమార్‌ ఆసుపత్రికి చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

ఘనంగా కాటమయ్యస్వామి గ్రామోత్సవం



ముష్టూరులో కాటికోటేశ్వరుడిని ఊరేగిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: సంజీవపురం సమీపంలో వెలసిన కాటి కోటేశ్వరుని క్షేత్రంలో నాలుగు రోజులు పాటు భక్తులకు దర్శనమిచ్చిన కాటమయ్యస్వామి ప్రభకు శనివారం రాత్రి స్వామి మూలస్థానమైన ఈదుల ముష్టూరులో గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం గ్రామంలో కొలువుదీరిన కాటమయ్యస్వామికి గ్రామస్తులు విశేష పూజలు నిర్వహించారు. గురవయ్యల విన్యాసాలు పలువురికి ఆకట్టుకున్నాయి. అనంతరం జంతుబలులు నిర్వహించారు. దీంతో ఉత్సవాలు ముగిశాయి. గ్రామంలో పెద్ద ఎత్తున దుకాణాలు వెలిశాయి. గ్రామంలోని మహిళలు దుకాణాల్లో గాజులు కొనుగోలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్‌ తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా కాటికోటేశ్వర బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ప్రజలకు, పోలీసులకు ఆలయ చైర్మన్‌ సుధాకరరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

నాటుసారాతో జీవితాలు నాశనం

గాండ్లపెంట: నాటుసారాతో జీవితాలు నాశనమవుతాయని జిల్లా ఎక్సైజ్‌ అధికారి నాగమద్దయ్య పేర్కొన్నారు. ఆదివారం చెరువుముందరతండాలో ఎక్సైజ్‌ శాఖ ఆధ్వర్యంలో నవదోయం2.0 కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, రవాణ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. నాటుసారాతో అనారోగ్యం తప్పదన్నారు. అంతేగాక కుటుంబాలు రోడ్డు పాలవుతాయన్నారు. ప్రభుత్వం అందించే పథకాల ద్వారా జీవనోపాధి పొంది ప్రశాంతంగా జీవించాలని తండావాసులకు సూచించారు. కదిరి ఎక్సైజ్‌ ఎస్‌ఐ శ్రీధర్‌, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌ మోటారు చోరీ

గాండ్లపెంట: గొడ్డువెలగల పంచాయితీ పరిధిలో గేదర్ల సమీపంలో ఉన్న సత్యసాయి మంచినీటి పంపు హౌస్‌లోని 25 హెచ్‌పీ విద్యుత్‌ మోటరు చోరీకి గురైంది. ఏఈ భానుప్రకాష్‌ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోటారు విలువ రూ.90 వేలు అవుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు హెచ్‌సీ శ్రీనివాసులు తెలిపారు.

పొట్టి శ్రీరాములు జయంతి

పుట్టపర్తి: బుక్కపట్నంలో ఆదివారం అమరజీవీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. బుక్కపట్నం ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ఆయన ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం చేసిన త్యాగాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రశాంత్‌, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

పుట్టపర్తి టౌన్‌: మున్సిపాలిటీకి ఆస్తి, ఇంటి, కుళాయి పన్నులను సకాలంలో చెల్లించాలని కమిషనర్‌ ప్రహ్లాద్‌ పట్టణ ప్రజలను కోరారు. ఈమేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి, కుళాయి పన్నులను ఈనెల 31 తేదీ లోపు చెల్లించాలని కోరారు. ఆదేవిధంగా పెండింగ్‌లో ఉన్న పాత బకాయిలకు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ఆస్తులు జప్తు చేస్తామని పేర్కొన్నారు. వడ్డీ మాఫీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేనందున ప్రజలు వెంటనే పన్నులు చెల్లించాలని సూచించారు. పన్నులు చెల్లించని పక్షంలో యూజీడీ, కుళాయి కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరించారు.

మండల మీట్‌ నిరవధిక వాయిదా

నల్లచెరువు: ప్రోటోకాల్‌ వివాదంతో మండల పరిషత్‌ కార్యాలయంలో శనివారం జరగాల్సిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీతో పాటూ ఎంపీటీసీలు గైర్హాజరు కావడంతో సభ ఆదివారానికి వాయిదా వేశారు. అయితే ఆదివారం సభ ప్రారంభమైనా సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కాకపోవడంతో సభను నిరవధిక వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ గుప్తా ప్రకటించారు.